సాక్షి కామారెడ్డి

బుధవారం : 16 : ఏప్రిల్ : 2025



అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో అగ్నిమాపక వారోత్సవాలు కొనసాగుతున్నాయి. సిబ్బంది ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నారు.

- 9లో ▸



వేతనాలు రాకుండా..

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు నాలుగు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.7 /22.1

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రాజెక్టు వద్ద మెట్ల నిర్మాణానికి నిధులు మంజూరు

నాగిరెడ్డిపేట : పోచారం ప్రాజెక్టు వద్ద మెట్ల నిర్మాణం కోసం రూ. 11.65 లక్షలు మంజూరయ్యాయని ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఆయన ప్రాజెక్టును పరిశీలించారు. వర్షకాలంలోగా ప్రాజెక్టు వద్ద చేపట్టాల్సిన మరమ్మతుల గురించి ఏఈ అక్షయ్‌కుమార్‌తో చర్చించారు. ప్రాజెక్టు వద్దనున్న గంగమ్మ గుడి దగ్గర నుంచి అలుగు వద్దకు వెళ్లేందుకు మెట్ల నిర్మాణం కోసం త్వరలోనే టెండర్ ప్రక్రియ నిర్వహిస్తామని డీఈఈ తెలిపారు. ప్రాజెక్టు, ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీలకు చేపట్టాల్సిన మరమ్మతులకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపించామన్నారు.

అదనపు బాధ్యతలకు రాజీనామా



భిక్కనూరు: బీటీఎస్ వద్దనున్న తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు అదనపు పరిపాలన బాధ్యతలకు రాజీనామా చేశారు. ఈ మేరకు మంగళవారం సౌత్ క్యాంపస్ ప్రిన్సిపల్ సుధాకర్‌గౌడ్‌కు రాజీనామా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా మాట్లాడుతూ చాలా ఏళ్లుగా తాము బోధనతో పాటు అదనపు పరిపాలన బాధ్యతలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారించడం లేదన్నారు. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం ఈనెల 19 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు తెలిపారు. ఈ విషయమై ప్రిన్సిపల్‌కు సమ్మె నోటీసు అందించామన్నారు. అదనపు బాధ్యతలకు రాజీనామా చేసిన వారిలో సౌత్ క్యాంపస్ బాయ్స్ హాస్టల్ వార్డెన్ యాలాద్రి, గర్ల్స్ హాస్టల్ వార్డెన్ సునీత, ఉమెన్ సెల్ అసిస్టెంట్ డైరెక్టర్ వైశాలి, ఏపీఆర్వో సరిత ఉన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు రమాదేవి, నరసయ్య, నిరంజన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

18 వరకు బియ్యం పంపిణీ

కామారెడ్డి టౌన్: రేషన్ దుకాణాలలో బియ్యం పంపిణీ గడువును ఈనెల 18 వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు బియ్యం తీసుకోని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

'వచ్చేనెలలో బీసీల యుద్ధ భేరి'



కామారెడ్డి టౌన్ : బీసీల సమస్యల పరిష్కారం కోసం వచ్చేనెలలో హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో 10 లక్షల మందితో బీసీల యుద్ధ భేరి నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించిన బీసీ బిల్లుకు కేంద్రం ఆమోద ముద్ర వేయాలని కోరారు. జాతీయ జనగణనలో బీసీల జనగణన కూడా చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శివరాములు, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజ్ గౌడ్, ఉపాధ్యక్షులు మోహనాచారి, హజీజ్, మధు, భాస్కర్ గౌడ్, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు మల్లన్న, నాయకులు శ్రీనివాస్ గౌడ్, గంగాధర్, హైమద్, రవి, విజయలక్ష్మి, దయాకర్ పాల్గొన్నారు.

'తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు'

కామారెడ్డి క్రైం: రేషన్ షాప్‌ల ద్వారా ప్లాస్టిక్ బియ్యం సరఫరా చేస్తున్నారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఈ వదంతులను నమ్మవద్దని సూచించారు. ఇతర జిల్లాలలో ఇలాంటి ప్రచారాలు జరుగుతున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. అసత్య ప్రచారాలు చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

భూభారతితో భూసమస్యలకు చెక్



- పైలట్ ప్రాజెక్టు మండలంలో సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తాం
- మిగతా మండలాల్లో రేపటినుంచి అవగాహన శిబిరాలు
- పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ
- తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ''భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం భూ భారతి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. పైలట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలో నాలుగు మండలాలను ఏర్పాటు చేయగా అందులో మన లింగంపేట కూడా ఉంది. ముందుగా లింగంపేట మండలంలోని 23 రెవెన్యూ గ్రామాల్లో భూభారతిపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి ఆ యా సమస్యలను పరిష్కరిస్తాం. భూసరిహద్దులు నిర్ణయించి నక్షతో కూడిన భూధార్ కార్డును జారీ చేస్తాం'' అని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. జిల్లాలో భూభారతి అమలు, తాగునీటి సమస్య, ధాన్యం కొనుగోళ్లు తదితర అంశాలపై మాట్లాడారు. ఆ వివరాలు..

భూభారతి అమలు కోసం పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన లింగంపేట మండలంలోని 23 రెవెన్యూ గ్రామాల్లో పని మొదలవుతుంది. ఈనెల 17 నుంచి 30 వరకు రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఆయా గ్రామాలకు వెళ్లి ప్రజలకు భూ భారతి గురించి అవగాహన కల్పిస్తారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, ఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్‌లు రెండుమూడు బృందాలుగా విడిపోయి రోజూ రెండు, మూడు గ్రామాల్లో జరిగే సభల్లో పాల్గొంటారు. భూ సమస్యలపై ప్రజలనుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు.

అన్ని మండలాల్లో అవగాహన శిబిరాలు..

జిల్లాలోని 25 మండల కేంద్రాల్లో ఈనెల 17 నుంచి 30 వరకు భూ భారతిపై అవగాహన సభలు నిర్వహిస్తాం. అన్ని కార్యక్రమాలలో నేను పాల్గొంటాను. అయితే పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన లింగంపేట మండలంలో మాత్రమే తొలుత దరఖాస్తులు స్వీకరిస్తాం. మిగతా మండలాల్లో భూభారతిపై అవగాహన మాత్రమే కల్పిస్తాం. భూ భారతి పోర్టల్‌లో రికార్డులన్నీ నమోదయ్యేదాకా ధరణి పోర్టల్ ద్వారా పనులు కొనసాగుతాయి.

మ్యాపింగ్ అయ్యాక భూధార్...

భూభారతిపై అవగాహన కల్పించాక.. ప్రజలనుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం. వాటిని పరిష్కరించిన తర్వాత భూముల సర్వే చేసి మ్యాపింగ్ చేస్తాం. అనంతరం భూధార్ కార్డు జారీ చేస్తాం. భూభారతిలో రైతులు తమ సమస్యలకు సంబంధించి తహసీల్దార్ ఇచ్చిన ఆదేశాలపై ఆర్డీవోకు, ఆర్డీవో ఇచ్చిన వాటికి కలెక్టర్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుంది. కలెక్టర్ ఇచ్చిన వాటిపై ల్యాండ్ ట్రిబ్యునల్‌కు వెళ్లవచ్చు.

'ఇందిరమ్మ'కు ప్రత్యేకాధికారులు..

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం గురువారం వరకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తాం. కామారెడ్డి నియోజకవర్గానికి స్థానిక ఆర్డీవో, బాన్సువాడకు స బ్ కలెక్టర్, ఎల్లారెడ్డికి ఆర్డీవో, జుక్కల్‌కు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ను ప్రత్యేకాధికారులుగా నియమించాం. లబ్ధిదారులఎంపికలో అత్యంత నిరుపేద లు, వితంతువులువంటి వారికి ప్రాధాన్యతనిస్తాం. మండలాల్లో ఎంపీడీవోలు, ఎంపీవోలతో బృందాల ను ఏర్పాటు చేసి గ్రామాల వారీగా లబ్ధిదారుల జా బితాలు రూపొందిస్తాం. వచ్చేనెల 2 వరకు అర్హుల జాబితాలను ప్రదర్శిస్తాం. ఇంటి స్థలం లేని పేదలకు అందుబాటులో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయిస్తాం. పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గ్రామాల్లో 350 ఇళ్లు గ్రౌండ్ అవగా, 50 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్‌కు చేరాయి.

ధాన్యం కొనుగోళ్లు మరూ...

జిల్లాలో 446 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఇందులో 183 కేంద్రాలను మహిళా సంఘాలకు కేటాయించాం. ఇప్పటికే 426 కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు 15 వేల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేసి మిల్లులకు పంపించాం. అకాల వర్షాల నేపథ్యంలో రైతులను అప్రమత్తం చేశాం. వడ్లు నానకుండా అవసరమైన టార్పాలిన్లు సిద్ధంగా ఉంచాం. కొనుగోలు కేంద్రాలకు 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రావచ్చని అంచనా వేశాం. మే నెలాఖరునాటికి కొనుగోళ్లను పూర్తి చేస్తాం.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా..

వేసవి నేపథ్యంలో నీటి ఎద్దడి నివారణకు ఇప్పటికే పలు చర్యలు తీసుకున్నాం. తాజాగా రూ. కోటి మంజూరయ్యాయి. నీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఈ నిధులను పంచాయతీలకు కేటాయిస్తాం. వాటిని మోటార్లు, పైప్ లైన్‌ల మరమ్మతులు, నీటి సరఫరా, ఇతర పనులకు వినియోగిస్తాం.

విస్తృతంగా ప్రచారం చేయాలి

కామారెడ్డి క్రైం : భూ భారతి పోర్టల్‌పై విస్తృతంగా ప్రచారం చేయాలని,, రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. మంగళవారం సాయంత్రం భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, తాగునీరు, రేషన్ కార్డుల వెరిఫికేషన్, భూగర్భ జలాల పెంపు అంశాలపై ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలు, మండల ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతిపై అన్ని మండలాల్లో సదస్సులు నిర్వహించాలని, ఒక్కో సదస్సుకు కనీసం 200 మంది రైతులు హాజరయ్యేలా చూడాలని సూచించారు. సదస్సు ఏర్పాట్ల కోసం ప్రతి మండలానికి రూ.10 వేలు కేటాయించామన్నారు. రోజుకు రెండు మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ప్రస్తుతం ధరణి పోర్టల్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. బుధవారంలోగా లబ్ధిదారుల జాబితాలను ఇందిరమ్మ కమిటీలకు ఇస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పక్కన అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్

'జల సంరక్షణ చర్యలు చేపట్టాలి'

కామారెడ్డి క్రైం : జల సంరక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. భూగర్భ జలాల సంరక్షణపై కలెక్టరేట్‌లో మంగళవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయన్నారు. భూగర్భ జలాల సంరక్షణకోసం ఉపాధి హామీ పనుల కింద సోక్ పిట్, ఫాంపాండ్స్, కాంటూరు కందకాలు వంటివి నిర్మించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చందర్ నాయక్, భూగర్భ జల శాఖ ఏడీ సతీష్ యాదవ్, డీఆర్డీవో సురేందర్, డీఏవో తిరుమల ప్రసాద్, ఉద్యాన శాఖ అధికారి జ్యోతి, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

ఆస్పత్రుల్లో హాజరుపై నిఘా!

- వైద్యులు, సిబ్బంది డుమ్మాలకు చెక్ పెట్టేందుకు చర్యలు
- జిల్లాలోని ఆస్పత్రులలో పనిచేస్తున్నవారి వివరాల సేకరణ పూర్తి
- త్వరలో 'అభాస్' హాజరు విధానం అమలయ్యే అవకాశం



కామారెడ్డి టౌన్ : విధులకు డుమ్మా కొట్టేవారికి చెక్ పెట్టేందుకు వైద్యారోగ్య శాఖ నూతన హాజరు విధానాన్ని తీసుకురాబోతోంది. ఆధార్ బేస్డ్ బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్(అభాస్) అమలు చేయబోతోంది. ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది విధులకు హాజరైనా మధ్యలోనే వెళ్లిపోవడం, క్షేత్రస్థాయి విధులకు వెళ్లామని చెప్పి తప్పించుకోవడం, విధులకు రాకపోయినా వచ్చినట్లు సంతకాలు చేయడంలాంటివి జరుగుతున్నట్లు వైద్యారోగ్య శాఖ గుర్తించింది. ఇలా వ్యవహరించే ఉద్యోగులకు చెక్ పెట్టాలని నిర్ణయించింది. అలాంటి వారిపై ఇక ప్రత్యేక నిఘా ఉండనుంది. ఇందుకోసం కొత్త హాజరు విధానాన్ని ప్రవేశ పెట్టబోతోంది. అందులో కిందిస్థాయి సిబ్బందినుంచి ఉన్నతాధికారుల వరకు ఒకే రకమైన హాజరు విధానం ఉండనుంది.

జిల్లాలో మూడు ఏరియా ఆస్పత్రులు, ఏడు సీహెచ్‌సీలు, 20 పీహెచ్‌సీలు, రెండు యూపీహెచ్‌సీలు ఉన్నాయి. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రభుత్వ ఆస్పత్రులు, కార్యాలయాల్లో పని చేసేవారి ఆధార్ వివరాలు సేకరించి, ఉన్నతాధికారులకు పంపించారు. అభాస్ హాజరు విధానం అమలులోకి వస్తే.. మొబైల్ యాప్ ద్వారా లొకేషన్ ఆధారంగా హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. వైద్యులు, ఇతర సిబ్బంది ఆస్పత్రికి ఉదయం వచ్చిన తర్వాత, సాయంత్రం తిరిగి వెళ్లే సమయంలో తప్పనిసరిగా ఈ యాప్‌లో హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. దీంతో డుమ్మాలకు చెక్ పడుతుందని ఆశిస్తున్నారు.

వివరాలు పంపించాం



జిల్లాలోని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీ, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల నుంచి వైద్యులు, సిబ్బంది ఆధార్ వివరాలను సేకరించి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు పంపించాం. నూతన హాజరు విధానానికి సంబంధించి ఇంకా పూర్తిగా విధివిధానాలు ఖరారు కాలేదు. ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేస్తాం. **– చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో, కామారెడ్డి**

ప్రతి ఇంటి నుంచి తరలిరావాలి

- రజతోత్సవ సభను విజయవంతం చేయాలి
- ఎమ్మెల్సీ కవిత పిలుపు



కాంగ్రెస్ నాయకురాలికి కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ కవిత

బాన్సువాడ : బీఆర్‌ఎస్ ఆవిర్భవించి 25 ఏళ్లు అవుతున్న నేపథ్యంలో వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ సభకు ప్రతి ఇంటి నుంచి తరలిరావాలని ఎమ్మెల్సీ కవిత పిలుపునిచ్చారు. మంగళవారం బాన్సువాడలో బీఆర్‌ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొనడానికి ఎమ్మెల్సీ కవిత హైదరాబాద్ నుంచి బాన్సువాడకు వచ్చారు. ఆమెకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా తాడ్కోల్ బస్టాండ్ నుంచి భారత్ గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కవిత మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఎవరో పెట్టిన భిక్ష కాదన్నారు. కేసీఆర్ త్యాగాలు, పోరాటాల వల్లే ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశారన్నారు. త్వరలో బాన్సువాడలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని బీఆర్‌ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. అధికారం కోసం పార్టీ మారిన పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ఉప ఎన్నికలలో ఘోర పరాజయం తప్పదన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా బాన్సువాడ నియోజకవర్గానికే నిధులు కేటాయించారని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ పేర్కొన్నారు. ఈ ప్రభావం మిగతా నియోజకవర్గాలపై పడిందని, పోచారం వల్లే బీఆర్‌ఎస్ ఓటమి పాలయ్యిందని విమర్శించారు. కార్యక్రమంలో నస్రుల్లాబాద్ మండలం సంగెం గ్రామానికి చెందిన మణియమ్మ అనే మహిళ తన కూతురుకు వచ్చిన కల్యాణ లక్ష్మి డబ్బుల నుంచి రూ. 2 వేలను పార్టీ కోసం ఎమ్మెల్సీ కవితకు అందించారు. బాన్సువాడ పట్టణానికి చెందిన పలువురు కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు.

ఇవిగో కేసీఆర్ ఆనవాళ్లు..

పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ సస్యశ్యామలంగా తీర్చిదిద్దారని చెప్పడానికి చెక్‌డ్యామే సాక్ష్యమని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో బాన్సువాడ చింతల్‌నాగారం శివారులోని మంజీర నదిపై నిర్మించిన చెక్ డ్యాంను ఆమె సందర్శించారు. మండు వేసవిలోనూ మత్తడి దూకుతుండడాన్ని చూసి ఆనందం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఇలాంటి చెక్‌డ్యాంలు నాలుగు నిర్మించారని, ఒక్కో చెక్ డ్యాం కింద 1,600 ఎకరాలలో రెండు పంటలు పండుతున్నాయని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, కార్యకర్తలతో కలిసి కవిత సెల్ఫీ దిగారు.



చెక్‌డ్యాం వద్ద సెల్ఫీ దిగుతున్న ఎమ్మెల్సీ కవిత

ఖాళీ స్థలాల రిజిస్ట్రేషన్‌లకు ఆటంకాలు

- స్లాట్ విధానంలో నవరణలు చేసిన ప్రభుత్వం
- ఖాళీ స్థలాలకు సైతం బిల్డింగ్ పర్మిషన్ అడుగుతున్న వైనం
- వారం రోజులుగా నిలిచిన ఖాళీ స్థలాల రిజిస్ట్రేషన్లు
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ప్రజలు

దోమకొండకు చెందిన ఓ వ్యక్తికి గ్రామంలో పాత భవనం, ఖాళీ స్థలం ఉంది. దానిని తన ఇద్దరు కుమారులకు చేరి సగం రిజిస్ట్రేషన్ చేయాలని నిర్ణయించి గ్రామ పంచాయతీ నుంచి తన పేరుమీద ఇల్లు, స్థలం ఉన్నట్లుగా ధ్రువీకరణ పత్రాలు తీసుకుని రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ కోసం వచ్చాడు. అయితే పాత ఇంటికి సైతం ఆన్‌లైన్ బిల్డింగ్ పర్మిషన్ అడుగుతుండడంతో ప్రక్రియ ముందుకు సాగడం లేదు. అంతేకాకుండా ఖాళీ స్థలానికి డీటీసీపీ లేఅవుట్ నంబర్ సైతం అడుగుతోంది. దీంతో ఇల్లు, ఖాళీ స్థలం రిజిస్ట్రేషన్ నిలిచిపోయాయి. వారం నుంచి వారు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇలా చాలా మంది ఇబ్బందిపడుతున్నారు.

దోమకొండ : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్‌తో పాటు కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద, దోమకొండలలో కార్యాలయాలున్నాయి. ప్రభుత్వం ఈనెల 7వ తేదీ నుంచి స్లాట్ విధానంలో నవరణలు చేసింది. గ్రామాల్లో ఇళ్లు, ఖాళీ స్థలాలకు గ్రామ పంచాయతీ ధ్రువీకరణ పత్రాలు, ఇంటి పన్ను రశీదు పత్రాలతో ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్‌లు జరిగాయి. కానీ ప్రస్తుతం నవరించిన స్లాట్ విధానంలో ఖాళీ స్థలానికి డీటీసీపీ లేఅవుట్ నంబర్ లేదా లింక్ డాక్యుమెంట్ నంబర్, లేదా బిల్డింగ్ పర్మిషన్ ఆన్‌లైన్ నంబర్ అడుగుతోంది. దీంతో కొత్తగా గ్రామ పంచాయతీ ధ్రువీకరణ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో ఇళ్ల నిర్మాణానికి ఇప్పటివరకు మ్యాన్‌వల్ పర్మిషన్ మాత్రమే ఇచ్చారు. ఆన్‌లైన్ పర్మిషన్ లేకపోవడం వల్ల ఇళ్ల రిజిస్ట్రేషన్‌లకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. ఖాళీ స్థలాలకు సైతం ఆన్‌లైన్ అసెస్మెంట్ కాపీ, ట్యాక్స్ చెల్లించిన రశీదు ఉంటే రిజిస్ట్రేషన్ జరిగేది. కానీ కొత్త విధానం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయంలో సబ్ రిజిస్ట్రార్‌లకు సైతం ఎలాంటి సమాచారం లేదని తెలుస్తోంది. పైఅధికారుల నుంచి ఇలాంటి వాటికి గతంలో మాదిరిగా రిజిస్ట్రేషన్ చేయడానికి వారికి ఏ విధమైన సూచనలు లేవు. దీంతో వారం రోజులుగా ఖాళీ స్థలాల రిజిస్ట్రేషన్‌లు ఆగిపోయాయి.



ఈ-పంచాయతీతో ఇప్పటికే తలనొప్పులు..

ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ-పంచాయతీ పోర్టల్‌తో ప్రజలు ఇప్పటికే తిప్పలు పడుతున్నారు. ఆస్తులను విభజించే విషయంలో రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత ఇద్దరు అన్నదమ్ములు ఉంటే ఒకరికి మాత్రమే ఇంటి నంబర్ రాగా, ఇంకొకరికి తప్పుగా వస్తోంది. ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రవేశపెట్టిన ఈ-పంచాయతీ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత బ్లాక్ నంబర్ తప్పుగా వస్తోంది. దీంతో వారు అటు గ్రామ పంచాయతీ, ఇటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఆ సమస్య పరిష్కారం కాకముందే మళ్లీ కొత్త సమస్య రావడంతో రిజిస్ట్రేషన్‌ల కోసం వస్తున్న ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై రాష్ట్ర స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

స్లాట్ విధానంలో మార్పులతో ఇబ్బందులు..

ఈనెల 7వ తేదీ నుంచి స్లాట్ విధానంలో మార్పులు వచ్చాయి. నవరించిన స్లాట్ విధానం వల్ల గతంలో మాదిరిగా ఖాళీ స్థలాలు, ఇళ్లను గ్రామ పంచాయతీ ధ్రువీకరణ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయడానికి వీలులేదు. వాటికి లేఅవుట్ పర్మిషన్ లేదా గ్రామ పంచాయితీ బిల్డింగ్ ఆన్‌లైన్ పర్మిషన్ అవసరం అవుతాయి. లేదంటే లింకు డాక్యుమెంట్ ఉండాలి. కొత్త విధానం వల్ల రిజిస్ట్రేషన్‌లు బాగా తగ్గాయి. విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

– రమేశ్, ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్, దోమకొండ

క్లుప్తంగా

ఉద్యోగ భద్రత కల్పించాలి

భిక్కనూరు: విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈమేరకు తెయూ సౌత్ క్యాంపస్‌లో మంగళవారం 'సెక్రటేరియట్ ముట్టడి' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను తాత్కాలిక అధ్యాపకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన పార్ట్ టైం అధ్యాపకులు, కాంట్రాక్ట్ అధ్యాపకులు పాల్గొన్నారు.

సూపర్ బీడీ బ్రాంచ్‌లను తెరిపించాలి



కామారెడ్డి టౌన్: సూపర్ బీడీ కంపెనీ మూసివేసిన 152 బ్రాంచ్‌లను తక్షణమే తెరిపించాలని తెలంగాణ బీడీ రోలర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 10వేలకు పైగా బీడీ కార్మికులు ఈ కంపెనీలో పని చేస్తున్నారని అకారణంగా కంపెనీని మూసివేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించడం దారుణమన్నారు. తక్షణమే అన్ని బ్రాంచ్‌లను తెరిపించి కార్మికులకు ఉపాధినివ్వాలని డిమాండ్ చేశారు.

బహుజనులపై దాడులు సరికావు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): బహుజనులపై దాడులు సరికావని, ఎవరైనా దాడులకు పాల్పడితే సహించేదిలేదని మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్ రావు అన్నారు. మండలంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లింగంపేట్‌లో అకారణంగా అధికార పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ సాయిలుపై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సాయిలుకు అండగా ఉంటామన్నారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ధోబీఘాట్



బాన్సువాడ రూరల్: మండలంలోని కోనాపూర్ గ్రామంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన ధోబీఘాట్ నిరుపయోగంగా మారింది. అధికారులు నీటి సౌకర్యం కల్పించకపోవడంతో ఏళ్లుగా వృథాగా మారడంతోపాటు శిథిలావస్థకు చేరుకుంది. అధికారులు స్పందించి ధోబీఘాట్‌కు మరమ్మతులు చేపట్టి, నీటిసౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పీజీ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ పీజీ 1, 3వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వీసీ ప్రొఫెసర్ టీ యాదగిరి రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం యాదగిరి మంగళవారం సాయంత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కే సంపత్‌కుమార్, ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, అడిషనల్ కంట్రోలర్ టీ సంపత్, పీఆర్‌వో ఏ పున్నయ్య తదితరులు పాల్గొన్నారు. ఫలితాల వివరాలను వర్సిటీ వెబ్‌సైట్ www.telanganauniversity.ac.inలో పొందుపర్చినట్లు కంట్రోలర్ తెలిపారు.

వేసవి క్రీడా శిబిరాలకు వేళాయే..!

- జిల్లాలో పది కేంద్రాల ఏర్పాటుకు అధికారుల కసరత్తు
- మే 1 నుంచి 31 వరకు కొనసాగనున్న శిక్షణ



వేసవి శిక్షణ శిబిరంలో వాలీబాల్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు (ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో జిల్లా యువజన, క్రీడల శాఖ వేసవి క్రీడాశిబిరాలను నిర్వహించేందుకు సన్నద్ధమవుతుంది. ఇన్నాళ్లు పుస్తకాలతో దోస్తీ చేసి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు వేసవిసెలవుల్లో ఆటలపై పట్టు సాధించేలా ఈ శిబిరాలను ఏర్పాటు చేయనుంది. క్రీడాశిబిరాల నిర్వాహణ కోసం ఆసక్తి గల సీనియర్ క్రీడాకారులు, జాతీయస్థాయి క్రీడాకారులు, పీఈటీ, పీడీల నుంచి సంబంధిత అధికారులు ఇదివరకే దరఖాస్తులను సైతం స్వీకరించారు.

14ఏళ్లలోపు బాలబాలికలకు..

క్రీడలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు జిల్లాలో 10 శిబిరాలను అధికారులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. మే 1నుంచి 31వరకు శిబిరాలను నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేశారు. 14ఏళ్ల లోపు బాలబాలికలకు ఎంపిక చేయబడ్డ క్రీడలలో నెలరోజులపాటు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారు. నెల రోజులపాటు శిబిరాలను నిర్వహించేవారికి రూ.4వేలు పారితోషికంగా చెల్లించడంతోపాటు శిబిరాల నిర్వాహణకు అవసరమైన క్రీడాసామగ్రిని పంపిణీ చేయనున్నారు. విద్యార్థులకు మరో పది రోజుల్లో వేసవి సెలవులు ప్రారంభంకానున్నాయి. ఈక్రమంలో వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా, వారిలో దాగి ఉన్న క్రీడానైపుణ్యాలను వెలికితీయడంతోపాటు క్రీడలపై వారికి తగిన శిక్షణ ఇచ్చేలా శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు.

సీఐపై ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు



రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు ఫిర్యాదు చేస్తున్న దళిత సంఘాల నాయకులు



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న దళిత నాయకులు

లింగంపేట(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి సీఐపై మంగళవారం దళిత నాయకులు హైదరాబాదు నాంపల్లిలోని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు ఫిర్యాదు చేశారు. అంబేడ్కర్ జయంతి రోజున లింగంపేటలో దళిత నాయకుడిని అర్ధనగ్నంగా పోలీసులు ఈడ్చుకెళ్లి అరెస్టు చేసిన ఘటనపై ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్‌తో పాటు సంబంధిత పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా చైర్మన్ వెంటనే కామారెడ్డి ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాజీ ఎమ్మెల్యే సురేందర్, ముదాం సాయిలు, జిల్లా అధ్యక్షుడు గంగారాం, సంగమేశ్వర్, నెల్లూరి గంగారాం, భూపతి, రాజు, జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

కామారెడ్డి ఎస్పీకి..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో జరిగిన ఘటనలో ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్‌పై చర్యలు తీసుకోవాలని దళిత సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు మంగళవారం జిల్లా ఎస్పీ రాజేష్‌చంద్రకు ఫిర్యాదు చేశారు. అంబేడ్కర్ సంఘ ప్రతినిధులు ముదాం సాయిలు, సంఘమేశ్వర్, గంగారాం, భూపతి, లెగ్గల రాజు, ఆశయ్య, అల్లూరి, మన్నె శ్రీనివాస్, సాయిలు, క్రాంతి, చెన్నం సాయిలు, భూషణం తదితరులు పాల్గొన్నారు.

అర్ధంతరంగా నిలిచిన 'అంగన్‌వాడీ'



రాముల గుట్టలో అసంపూర్తిగా నిలిచిన అంగన్‌వాడీ భవనం పనులు



అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని రాములగుట్ట తండాలో నూతనంగా నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. గతంలో రూ.9లక్షల నిధులు కేటాయించి భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. పనులు మొదలుపెట్టి ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తికావడం లేదు. అసంపూర్తి పనుల కారణంగా భవనం మందుబాబులకు అడ్డాగా మారింది. భవనం అందుబాటులోకి రాకపోవడంతో చిన్నారులు అద్దె భవనంలో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కోర్పోల్ గ్రామంలోగల అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఎంపీవో మలహరి తనిఖీ చేశారు. విద్యార్థులు, టీచర్ హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం గ్రామ శివారులోని వైకుంఠధామం, కంపోస్టు షెడ్డు, పల్లె ప్రకృతి వనం, నర్సరీలను పరిశీలించారు.

ఉద్యమకారుడికి పరామర్శ



బాన్సువాడ రూరల్: ఇటీవల అనారోగ్యానికి గురైన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు దండు విజయ్‌కుమార్‌ను మంగళవారం ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. బాన్సువాడలోని జర్నలిస్టు కాలనీలో దండు విజయ్‌కుమార్ ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, నాయకులు గంగాధర్, సాయిబాబా, చందు, రాజు, గైని గంగారాం, భాస్కర్‌గౌడ్, ఖాదర్, మహేష్, కృష్ణ తదితరులు ఉన్నారు.

వరంగల్ సభను జయప్రదం చేయాలి



నిజాంసాగర్(జుక్కల్): ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లి వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వరంగల్ సభకు జనసమీకరణ ఏర్పాట్లపై ముఖ్యనాయకులతో చర్చించారు. జుక్కల్ నియోజకవర్గం నుంచి 3వేల మంది కార్యకర్తలను వరంగల్ సభకు తరలిస్తున్నామన్నారు. మండల నాయకులు దుర్గారెడ్డి, గైని. విఠల్, నర్సింహారెడ్డి, రమేష్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



కామారెడ్డి టౌన్: గ్రామీణ ప్రాంతంలోని మహిళల సురక్షితమైన ఆరోగ్యం కోసం ఏబీవీపీ ఆధ్వర్యంలో రుతుమర్తి అభియాన్ కార్యక్రమాన్ని రూపొందించినట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ప్రత్యూష రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మంగళవారం కార్యక్రమ వాల్ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలను చైతన్యపరుస్తామన్నారు. ప్రిన్సిపల్ విజయ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ల లీకేజీ.. తాగునీరు వృథా



పైప్‌లైన్ లీకేజీతో బుడిమి రోడ్డు పక్కన వృథాగా పారుతున్న నీరు

బాన్సువాడ రూరల్: మిషన్ భగీరథ పథకం నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా తాగునీరు వృథా అవుతోంది. మండలంలోని ఎక్కడో ఓచోట ప్రతిరోజు పైప్‌లైన్‌లు లీకేజీకి గురికావడంతో నీరు కలుషితమవుతున్నాయి. పైప్‌లైన్ లీకేజీలను సరిచేయించాల్సిన అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రజలకు కలుషిత నీరే సరఫరా అవుతోంది. దీంతో ప్రజలు మినరల్ వాటర్ క్యాన్లలో నీటిని కొనితెచ్చుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీలను పూడ్చి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా పారిశుధ్యం



బుడిమి హైస్కూల్ సమీపంలో చెత్తాచెదారం

బాన్సువాడ రూరల్: మండలంలోని బుడిమి గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. పంచాయతీ కార్మికులు రోడ్లను, డ్రెయినేజీలను నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారం ఎక్కడికక్కడ పేరుకుపోతుంది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో, వాటర్‌ట్యాంకు సమీపంలో రోడ్డుపై చెత్త పేరుకుపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్యం సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

క్రైం కార్నర్

అనారోగ్యంతో బీఆర్ఎస్ నాయకుడి మృతి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బాపురావు(50) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు పార్టీ నాయకులు, గ్రామస్తులు తెలిపారు. స్వగ్రామమైన చిట్యాలలో అంత్యక్రియలను జరిపించారు.

ప్రమాదవశాత్తు చెరువులోపడి వృద్ధుడి మృతి



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణ శివారులోని గుండ్ల చెరువులో ప్రమాదవశాత్తు పడి కుంట గంగా మోహన్‌రెడ్డి(65) మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. మంగళవారం గుండ్ల చెరువులో బట్టలు ఉతకడానికి వెళ్లిన కుంట గంగామోహన్‌రెడ్డి ప్రమాదవశాత్తు చెరువులో పడి చెందాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు. మృతుడు తెలంగాణ మలిదశ ఉద్యమంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌తో కలిసి పాల్గొన్నాడని స్థానికులు తెలిపారు. గంగామోహన్‌రెడ్డి అంత్యక్రియల్లో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

దుబాయ్‌లో రెడ్డిపేటవాసి..



రామారెడ్డి: మండలంలోని రెడ్డిపేట గ్రామానికి చెందిన బట్టు సురేశ్(42) అనే వ్యక్తి దుబాయ్‌లో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఐదు నెలల క్రితం ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన సురేశ్‌కు ఈ నెల 12న బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆస్పత్రిలోనే మరణించాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సురేశ్ మృతదేహాన్ని స్వదేశానికి పంపేందుకు దుబాయ్‌లో ఉన్న బట్టు శంకర్, నవీన్ ప్రయత్నిస్తున్నట్లు గల్ఫ్ సంఘ సభ్యులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గల్ఫ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బండ సురేందర్‌రెడ్డి కోరారు.

అడవిపంది దాడి.. ఒకరికి గాయాలు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ గ్రామానికి చెందిన కొనగోళ్ల సాయిబాబా అనే వ్యక్తిపై అడవిపంది దాడి చేసినట్లు స్థానికులు మంగళవారం తెలిపారు. సాయిబాబా తన పొలానికి వెళ్తున్న సమయంలో అడవిపంది దాడి చేయడంతో చేతు, కాలికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన సాయిబాబాను ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ పరామర్శించారు. అటవీశాఖ అధికారులు బాధితుడికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

- ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



కామారెడ్డి క్రైం: లారీ డ్రైవర్ నిర్లక్ష్యం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. అతివేగంగా వచ్చిన లారీ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన జిల్లా కేంద్రానికి సమీపంలోని ఉగ్రవాయి మైసమ్మ స్టేజీ వద్ద కామారెడ్డి–సిరిసిల్లా ప్రధాన రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. రాజన్న సిరిసిల్లా జిల్లా గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామానికి చెందిన నాగుల వినోద్ కుమార్ (30) చేపలు పట్టడం, కూలీ పనులు చేసుకుంటూ జీవించేవాడు. చేపల పని మీద తన స్నేహితుడు జక్కుల దేవేందర్‌తో కలిసి బైక్‌పై కామారెడ్డికి బయల్దేరారు. ఉగ్రవాయి మైసమ్మ స్టేజీ సమీపంలోకి రాగానే బైక్‌ను లారీ ఢీకొనగా ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే కామారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపటికే చికిత్స పొందుతూ వినోద్ కుమార్ మృతి చెందాడు. దేవేందర్‌ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ రిఫర్ చేశారు. మృతుడి తల్లి సత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

దుబాయ్‌లో దారుణం

- ఇద్దరు తెలంగాణవాసుల హత్య
- జిల్లావాసికి తీవ్రగాయాలు



దేగాం సాగర్

మోర్తాడ్(బాల్కొండ): దుబాయ్‌లోని ఆల్‌కూజ్ ప్రాంతంలో తెలంగాణవాసుల హత్య కలకలం సృష్టించింది. గడిచిన శుక్రవారం ఈ దుర్ఘటన చోటు చేసుకోగా సామాజిక మాధ్యమాల ద్వారా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మోడ్రన్ బేకరీ అనే సంస్థలో పని చేస్తున్న తెలంగాణ వాసులపై పాకిస్తాన్‌కు చెందిన ఓ వ్యక్తి కత్తిగట్టి హత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఘటనలో నిర్మల్ జిల్లా సోన్‌కు చెందిన ప్రేమ్‌సాగర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన శ్రీనివాస్ దుర్మరణం చెందగా, జిల్లాలోని ఆర్మూర్‌కు చెందిన దేగాం సాగర్‌కు తీవ్రగాయాలయ్యాయి. కాగా, నిందితుడిని దుబాయ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

సమాచారం బయటకు రాకుండా హుకుం

బేకరీలో ఇద్దరి హత్య, ఒకరిపై హత్యాయత్నం ఘటన సమాచారాన్ని సదరు సంస్థ యాజమాన్యం అత్యంత గోప్యంగా ఉంచింది. సంస్థలో తెలంగాణ వాసులు కొందరు, పాకిస్తాన్, ఇతర దేశాలకు చెందిన వారు పనిచేస్తుండగా ఘటనకు సంబంధించిన సమాచారం బయటికి చేరవేయకూడదంటూ యాజమాన్యం కార్మికులకు హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. సామాజిక మాధ్యమాల ద్వారా ఇక్కడి వారికి సమాచారం తెలిసినా యూఏఈలో ప్రధానంగా దుబాయ్‌లో ఉన్న తెలుగువారికి సరైన వివరాలు తెలియకపోవడం గమనార్హం. ఆల్‌కూజ్‌లోని బేకరీ ప్రాంతానికి యూఏఈ మినహా ఇతర దేశాల వారిని రాకుండా కంపెనీ యాజమాన్యం చర్యలు తీసుకున్నట్లు తెలంగాణ కార్మికులు కొందరు 'సాక్షి'తో ఫోన్‌లో చెప్పారు. దుబాయ్‌లోని సమాచారాన్ని బయట ప్రపంచానికి తెలియజేసే వీలు లేదని, దుబాయ్ పోలీసులు లేదా సంస్థ యాజమాన్యం మాత్రమే ఏదైనా ప్రకటన చేయడానికి అవకాశం ఉంటుందని కార్మికులు వెల్లడించారు. ఇదిలా ఉండగా హత్యకు గురైన వారి మృతదేహాలను, గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తిని ఇంటికి తరలించే ఏర్పాట్లు చేయాలని గల్ఫ్ కార్మిక సంఘాలు కోరుతున్నాయి. దుబాయ్‌లోని భారత విదేశాంగ శాఖ అధికారులు చొరవ తీసుకోవాలని పలువురు విన్నవిస్తున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు



మాక్లూర్ : పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని ఈ నెల 13న చిక్లి గ్రామశివారులో వడ్డె చిన్న గంగాధర్ (48) అనే వ్యక్తిని ట్రాక్టర్‌తో ఢీ కొట్టి మరణానికి కారణమైన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మాక్లూర్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నార్త్ జోన్ సీఐ బీ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. చిక్లి గ్రామానికి చెందిన వడ్డె చిన్న గంగాధర్‌కు అదే గ్రామానికి చెందిన కారం నవీన్‌కు మధ్య భూ తగాదాలు ఉన్నాయి. ఈ విషయంలో విడగొట్టు ప్రసాద్ అనే వ్యక్తి కారం నవీన్‌కు మద్దతు తెలపడంతో ఈ నెల 13న సొసైటీ గోదాం వద్ద ఘర్షణ జరిగిందన్నారు. నవీన్ వ్యక్తిగత విషయాలను మృతుడు వడ్డె చిన్న గంగాధర్ బహిరంగంగా విమర్శించేవాడని తెలిపారు. ఇద్దరి మధ్య తగాదాను పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడే క్రమంలోనే చిన్న గంగాధర్‌ను నవీన్ ఉద్దేశపూర్వకంగానే ట్రాక్టర్‌తో ఢీకొట్టి మరణానికి కారణమైనట్లు పేర్కొన్నారు. విడగొట్టు ప్రసాద్‌ను ఏ–2గా చేర్చినట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై శేఖర్, పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

వేంకటేశ్వర ఆలయంలో చోరీ



బాల్కొండ: మండలంలోని వన్నెల్(బీ) వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు హుండీ పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. 15 రోజుల క్రితమే ఉత్సవాలు జరగడంతో భక్తులు హుండీలో అధికంగా ముడుపులు వేసినట్లు స్థానికులు తెలిపారు.

నస్రుల్లాబాద్‌లో..

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని మైలారం గ్రామానికి చెందిన మహేందర్ గౌడ్‌కు చెందిన కిరాణా షాపు, నస్రుల్లాబాద్ మండల కేంద్రానికి చెందిన మోయిన్ ఖాన్ పాన్‌షాపులలో చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మూసి ఉన్న షాపుల తాళాలు పగులకొట్టి నగదును అపహరించారని పేర్కొన్నారు. దుండగులు నస్రుల్లాబాద్‌లోని పాల కేంద్రం, కిరాణాషాపులో చోరీకి యత్నించారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బాయిలర్ ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రానికి సమీపంలోని సాయిరాం ఆగ్రో బాయిలర్ ఫ్యాక్టరీలో మంగళవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. బాయిలర్ ఫ్యాక్టరీలో బ్రిక్స్ తయారి కోసం పెద్ద మొత్తంలో సోయాబీన్, శనగ, కంది పొట్టును సేకరించారు. ఫ్యాక్టరీ నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో కూలీలు, యజమానులు బయటకు పరుగులు తీశారు. మద్నూర్ అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో మహారాష్ట్రలోని దెగ్లూర్ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. రెండు ఫైరింజన్లతో సిబ్బంది మూడు గంటలపాటు కష్టపడి మంటలను ఆర్పివేశారు. సుమారు రూ.10లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



గంగాధర్ మృతదేహం

ఆర్మూర్ టౌన్: ఆర్మూర్ పట్టణంలోని క్లాక్ టవర్ వద్ద మంగళవారం సాయంత్రం లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. జిరాయత్‌నగర్‌లో నివాసముండే ఒడ్డె గంగాధర్(55) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం పని నిమిత్తం ఎక్సెల్ బైక్‌పై వెళ్తున్న గంగాధర్‌ను క్లాక్ టవర్ వద్ద రెడిమిక్స్ లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో గంగాధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ధాన్యం లారీ ఢీకొని మరొకరు..

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లంగ్డాపూర్ బ్రిడ్జి వద్ద సోమవారం రాత్రి ధాన్యం లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మోస్రా మండలంలోని గోవూర్ గ్రామానికి చెందిన రాజాగౌడ్, లాలూ ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం కందకుర్తికి వెళ్లి పెగడాపల్లి మీదుగా బోధన్‌కు తిరిగి వస్తున్నారు. బోధన్ నుంచి పెగడాపల్లి వైపు ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీ లంగ్డాపూర్ బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న లాలూ(43)కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, రాజాగౌడ్‌కు గాయాలయ్యాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని లాలూ మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లారీని అదుపులోకి తీసుకొని, మృతుడి భార్య ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తాగి వాహనాలు నడిపిన పలువురికి జైలు

డిచ్‌పల్లి/నవీపేట/ఖలీల్‌వాడి: డిచ్‌పల్లి సర్కిల్ పరిధిలోని డిచ్‌పల్లి, ఇందల్వాయి, జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో దొరికిన పలువురికి జైలు శిక్ష పడినట్లు సీఐ కే మల్లేశ్ మంగళవారం తెలిపారు. రెండ్రోజుల క్రితం డిచ్‌పల్లి పీఎస్ పరిధిలో తనిఖీలు చేపట్టగా తనుగు ప్రవీణ్(ఆకుల కొండూర్), ములుగు శామ్యూల్(బర్ధిపూర్), మల్లేశ్(డిచ్‌పల్లి), గుగులోత్ మోహన్ (డీబీ తండా)లు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు తేలింది. కేసు నమోదు చేసి మంగళవారం కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి 2 రోజులు జైలు శిక్ష విధిస్తూ జిల్లా స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ బేగం తీర్పు వెలువరించారు. ఇందల్వాయి పీఎస్ పరిధిలో దొరికిన ఐదుగురికి రూ.12 వేల జరిమానా విధించారు. జక్రాన్‌పల్లి పీఎస్ పరిధిలో సంతోష్‌నగర్ కాలనీకి చెందిన బోదాసు తిరుపతికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. నవీపేట శివారులో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలో పట్టుబడ్డ అభంగపట్నం గ్రామానికి చెందిన పురం అశోక్, ఏపీలోని ప్రకాశం జిల్లాకు చెందిన కొండల్‌రావులకు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై వినయ్ పేర్కొన్నారు. నిజామాబాద్ నగరంలోని మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి నాందేవ్‌వాడకు చెందిన బత్తుల యాదగిరి, సుభాష్‌నగర్‌కు చెందిన నాగెల్లి గంగయ్యకు కోర్టు ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.

బోధన్‌లో ఒకరికి జైలు..మరొకరికి జరిమానా

రెంజల్(బోధన్): రెంజల్ క్రాసింగ్ వద్ద సోమవారం సాయంత్రం మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డ మధుకర్ కాంబ్లేకు ఒక రోజు జైలు శిక్ష విధించగా, మరొకరికి రూ.4వేల జరిమానా విధిస్తూ బోధన్ కోర్టు అదనపు ద్వితీయశ్రేణి న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.